ప్రజాశక్తి

శుక్రవారం 19 సెప్టెంబర్ 2025 8 పేజీలు





శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

గ్రామీణాభివృద్ధి శాఖల సమన్వయంతో

జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి

కలెక్టర్ హిమాన్ను శుక్లా



సమీక్షిస్తున్న కలెక్టర్ హిమాన్ను శుక్లా

ప్రజాశక్తి-నెల్లూరు

గ్రామీణాభివృద్ధి శాఖల సమన్వయ కృషితోనే గ్రామాల అభివృద్ధి, తద్వారా జిల్లా సమగ్రాభివద్ధి కృషి చేయాలని కలెక్టర్ హిమాన్ను శుక్ల అన్నారు.గురువారం కలెక్టరేట్లోని తన చాంబర్లో డిఆర్‌డిఎ, డ్వామా, పంచాయతీ, ఆర్డబ్ల్యూఎస్ పంచాయతీరాజ్ శాఖల సమీక్ష సమావేశం కలెక్టర్ నిర్వహించారు. గ్రామాల అభివద్ధికి కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నాయన్నారు. వాటిని సక్రమంగా అమలు చేసి అన్ని విభాగాల్లో జిల్లాను ముందంజలో ఉంచేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. అందుకు అవసరమైన సహాయ సహకారాలు అన్నివేళలా అందిస్తామన్నారు. వివిధ రకాల కార్యక్రమాల ప్రతిపాదనల తయారీకి ముందే ఆయా స్టేట్ హోల్డర్లతో చర్చించిన అనంతరమే ప్రతిపాదించాలన్నారు. పంచాయతీలలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించుటలో ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్మెంట్ , కిచెన్ గార్డెన్స్ , ఇంటింటి చెత్త సేకరణ, గ్రీన్ అంబాసిడర్స్, ఆరోగ్యకరమైన జీవన విధానం ప్రోత్సహించటం తదితరాల గురించి దిశా నిర్దేశం చేశారు. జిల్లాలోని బిసి, ఎస్ సి, ఎస్ టి సంక్షేమ హాస్టల్స్ లో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా మరుగుదొడ్లు నిర్మించేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. డిఆర్‌డిఎ, డ్వామా పిడీలు నాగరాజ కుమారి, గంగాభవాని, డిపిఓ శ్రీధర్ రెడ్డి, జడ్పీ సీఈవో మోహన్ రావు, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ ఈ లు కోటేశ్వరరావు, విజయ భాస్కర్ పాల్గొన్నారు.

మృతదేహాలతో సిపిఎం ఆందోళన

ఒక్కో కుటుంబానికి రూ. 25 లక్షలు పరిహారం అందజేయాలని డిమాండ్

ప్రజాశక్తి-నెల్లూరు : పెరమన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఏడుగురి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, మృతి చెందిన ఒకొక్క కుటుంబానికి నష్టపరిహారంగా రూ.25 లక్షలు అందజేయాలని సిపిఎం నగర కమిటీ డిమాండ్ చేసింది. ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో వైద్యచికిత్సలు తీసుకుంటున్న కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు కారులో వెళ్తుండగా పెరమన ప్రాంతంలో ఇసుక లారీ ఢీ కొని ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందడం అందరికీ తెలిసిందే. వీరిలో కొంత మంది ఇందుకూరు పేట ప్రాంతానికి చెందిన వారు కాగా ఇద్దరు గుర్రాల మడుగు సెంటర్ ప్రాంతానికి చెందిన వారు. రోడ్డు ప్రమాదం చోటు చేసుకొన్న 24 గంటలు పూర్తియినప్పటికీ జిల్లా అధికారులు, ప్రభుత్వం బాధిత కుటుంబాలకు ఎటువంటి ఎక్స్‌గ్రేషియా ప్రకటిం చకపోవడంతో గుర్రాలమడుగు సెంటర్ ప్రాంతానికి చెందిన శారమ్మ, వెంగయ్య మృత దేహాలతో బాధిత కుటుంబ సభ్యులు, సిపిఎం నగర కమిటీ నాయకులు కత్తి శ్రీనివాసులు,ఆర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ముత్తుకూరు గేట్ సెంటర్‌లో బైటాయించి ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళన కార్యక్రమంతో సుమారు గంట పాటు ట్రాఫిక్ ఆ ప్రాంతంలో స్థంభించిపోయింది. సమాచారం తెలుసుకున్న రూరల్ డిఎస్‌పి జి.శ్రీనివాసులు, పోలీసు అధికారులు ముత్తుకూరు గేట్ సెంటర్ ప్రాంతానికి హుటాహుటిన చేరుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులకు నచ్చచెప్పే ప్రయత్నం చేసినా ప్రభుత్వం, జిల్లా అధికారుల నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు మృత దేహాలను ఈ ప్రాంతం నుంచి తరలించేది లేదంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రహదారిపై బైటాయించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కత్తి శ్రీనివాసులు మీడియాతో మాట్లాడుతూ పెరమన ప్రాంతంలో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన 7 మంది మృత్యువాతపడటం అత్యంత విషాధకరమన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం సమగ్ర విచారణ నిర్వహించి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలన్నారు. రోడ్డు ప్రమాదం చోటుచేసుకున్న ప్రాంతంలోనే సిపిఎం నాయకులు ఆందోళన



ముత్తుకూరు గేట్ సెంటర్‌లో మృతదేహాలతో ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

చేశారన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి సహాయం అందుతుందని 24 గంటలు ఎదురు చూశామని,ప్రభుత్వం నుంచి, అధికారుల నుంచి స్పష్టమైన హామీలు రాకపోవడం శోచనీయమన్నారు. కుటుంబంలోని పెద్ద దిక్కును కోల్పోయి తాము రోడ్డున పడ్డామని, ప్రభుత్వం నష్టపరిహారం అందజేయాలని ఆందోళన చేస్తుంటే పోలీసులు వచ్చి తాము మాట్లాడుతున్నామని, అధికారులు సైతం చర్చిస్తున్నారని,ఇన్సూరెన్స్ డబ్బులు వస్తాయని చెప్పడం దారుణమన్నారు. తక్షణమే మృతుల కుటుంబాలకు నష్టపరిహారం అందజేయాలని వారు డిమాండ్ చేశారు.



క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్న కమిషనర్

క్షేత్ర స్థాయిలో అర్జీలకు పరిష్కారం

ప్రజాశక్తి -నెల్లూరు కార్పొరేషన్ : నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై ఓ నందన్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందుకున్న సమస్యను క్షేత్రస్థాయిలో పరిష్కరించేందుకు స్థానిక గుడిపల్లిపాడు ప్రాంతంలోని కమ్యూనిటీ హాల్ ను అధికారులతో కలిసి పరిశీలించారు. సమస్యకు సంబంధించి పూర్తిస్థాయిల విచారించి శాశ్వత పరిష్కారం అందించాలని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను కమిషనర్ ఆదేశించారు. అనంతరం 2వ డివిజన్ సిరి గార్డెన్స్ ప్రాంతంలో ఇంజనీరింగ్, శానిటేషన్, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులతో కలిసి పర్యటించారు.డివిజన్ పరిధిలో డ్రైను కాలువల పూడికతీత, సిల్ట్‌ఎత్తివేత క్రమం తప్పకుండా చేపట్టాలని సూచించారు.



కాంప్లెక్స్‌లో తనిఖీ చేస్తున్న కమిషనర్

షాపింగ్ కాంప్లెక్స్‌లో తనిఖీ

ప్రజాశక్తి - నెల్లూరు కార్పొరేషన్ : నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ స్థానిక స్టోన్ హౌస్ పేట కన్యకా పరమేశ్వరి దేవాలయం సమీపంలోని కెఎసి మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాలను కమిషనర్ తనిఖీ చేశారు. దుకాణాల నిర్వాహకులు అద్దె బకాయిలను నోటీసులలో పేర్కొన్న సమయంలోపు చెల్లించాలని, లేనిపక్షంలో దుకాణాలను జప్తు చేసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. కేటాయించిన మున్సిపల్ దుకాణాలను నిర్వాహకులు యధా స్థితిలో ఉంచి వ్యాపార లావాదేవీలు నిర్వహించుకోవాలని, దుకాణాలలో ఇతర అదనపు నిర్మాణాలు, మరమ్మతుల కోసం నిర్మాణాల తొలగింపులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమని కమిషనర్ హెచ్చరించారు. నెల్లూరు నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగం అధికారులు, వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఓ

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-గుడ్లూరు : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా గర్భిణులు, కిషోర్ బాలికల కోసం ప్రవేశపెట్టిన వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఓ వై వెంకటేశ్వరరావు పేర్కొనాన్రు. గుడ్లూరు ప్రభుత్వ వైద్య ఆరోగ్య కేంద్రంలో వైద్య అధికారులు డాక్టర్ ఎల్ సాయి ప్రియాంక డాక్టర్ రమ్య రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని గురువారం ఏర్పాటు చేశారు. వైద్య కేంద్రానికి హాజరైన మహిళలందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు. ఏ ఎన్ఎంలు వైద్య సిబ్బంది అంగన్వాడీ కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

కరేడులో భూసేకరణపై మంత్రి 'అనగాని' అసత్యాలు

బిసివై పార్టీ అధినేత బోడే రామచంద్ర యాదవ్

ప్రజాశక్తి-కందుకూరు

కరేడు భూ సేకరణపై శాసనమండలిలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నీ అబద్దాలే చెప్పారని బిసివై పార్టీ అధినేత రామచంద్రయాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం కరేడు పేరు కూడా పలకలేని మంత్రి భూములు ఇచ్చేందుకు రైతులు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారంటూ అబద్దాలను వల్లె వేశారన్నారు. ఈ మేరకు బిసివె పార్టీ అద్యక్షుడు బోడె రామచంద్రయాదవ్ గురువారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఇండో సోల్ సోలార్ ప్రాజెక్టు కు భూములు ఇవ్వబోమని రైతులు ఉద్యమం చేస్తుంటే రైతులే స్వచ్ఛందంగా భూములు



బోడే రామచంద్ర యాదవ్

ఇస్తున్నారని అబద్ధాలు చెప్పడం దారుణమన్నారు. సెంటుభూమి కూడా ఇచ్చేది లేదని తెగేసి చెబుతున్నా ప్రభుత్వమే బలవంతంగా భూములను లాక్కుంటోందని ఆరోపించారు. ధైర్యముంటే కరేడుకు వెళ్లి అక్కడ రైతులతో మాట్లాడి నిజాలు తెలుసు కోవాలన్నారు. శాసనమండలిలో చేసిన వ్యాఖ్యలు కరేడులో చేయగలరా? అని సవాల్ విసిరారు. స్క్రిప్ట్ లు చదవడం మానేసి క్షేత్ర స్థాయిలో రైతులు పడుతున్న కష్టాలను తెలుసుకోవాలని రామచంద్రయాదవ్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-కందుకూరు : పట్టణం కాళిదాసు వారి వీధిలో నివాసం ఉంటున్న నాగసూరి శ్రీలక్ష్మి అనే పేద మహిళ గత కొన్ని నెలలుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. ఆమె కుటుం బం ఆర్థిక ఇబ్బందుల వలన వైద్యం నిమిత్తం దాతల కోసం ఎదురుచూస్తున్నారు. కందుకూరు పట్టణానికి చెందిన వేముల సుకుమార్ గుప్తా (వి.పి.జె. జ్యువెలరీ) ఆర్యవైశ్య మిత్రుల ద్వారా ఈ విషయం తెలుసుకొని గురువారం ఆమె వైద్యం నిమిత్తం రూ 10,000లు నగదును, నగదు తో పాటు పసుపు కుంకుమలతో చీరను అందజేశారు.వేముల సుకుమార్ గుప్తా మాట్లాడుతూ తోటి వారు ఇబ్బందుల్లో ఉంటే వారికి సహాయం చేయటం తనకు ఎంతో సంతప్తినిచ్చిందన్నారు. ఆల్ ఇండియా వాసవి సత్ర సముదాయాల మీడియా చైర్మన్ డాక్టర్ చక్కా వెంకట కేశవరావుమాట్లాడారు. డాక్టర్ రవ్వా శ్రీనివాసులు, గుర్రం చిన్న అల్లూరయ్య, ఓరుగంటి శివ శంకర్ రావు గార్లు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు : మండలంలోని మాచవరం, పలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు క్రీడా సామాగ్రిని వరల్డ్ విజన్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. మండల విద్యాశాఖాధికారులు ఎం.నాగ కుమార శర్మ , కె. సుబ్బారెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎంఇఒ నాగ కుమార శర్మ మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుందని విద్యార్థులకు వరల్డ్ విజన్ వారి చేయూత అభినందనీయమని తెలిపారు. మండల విద్యాశాఖాధికారి సుబ్బారెడ్డి మాట్లాడారు. వరల్డ్ విజన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ యెషయా విద్యార్థులకు అవసరమైన క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. వరల్డ్ విజన్ వారికి ఆయా



పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కె. శ్రీనివాసరావు, ఎస్ కె షౌకతుల్లా కతజ్ఞతలు తెలిపారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - లింగసముద్రం : మండలం లోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో స్కూల్ మట్టి,ఆరోగ్య కార్డులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు, విద్యార్థులకు మట్టి పరీక్షల ప్రాముఖ్యత, నేల ఆరోగ్యాన్ని కాపాడే పద్ధతుల గురించి వివరించారు .కార్యక్రమంలో లింగసముద్రం మండల వ్యవసాయ అధికారి సి.హెచ్.వి.ఎల్. దుర్గ, కందుకూరు భూసార పరీక్షా కేంద్రం వ్యవసాయ అధికారి వి. గీతా ప్రకాష్, కందుకూరు కషి విజ్ఞాన కేంద్రం నుండి వ్యవసాయ ఇంజనీరింగ్ విభాగం విషయ నిపుణుడు వివేక్ కామత్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా దుర్గ, గీతా ప్రకాష్, శ్రీ వివేక్ కామత్ మాట్లాడారు పాఠశాల ప్రిన్సిపాల్ స్నేహలత, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



గురుకులంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం



క్రీడా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - లింగసముద్రం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి ఆటల పోటీలను మండల కేంద్రమైన లింగసముద్రంలోని కమ్మిశెట్టి రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు.రెండు రోజుల పాటు జరిగే ఈ క్రీడా పోటీలను గురువారం మండల పరిషత్ అభివద్ధి అధికారి కట్టా శ్రీనివాసులు,మండల విద్యాశాఖ అధికారులు కనపర్తి మాల్యాద్రి,శివకుమార్ ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయులు ఉమ్మడిశెట్టి మాధవరావు, మొగిలిచర్ల ప్రధానోపాధ్యాయులు సూర్య ప్రకాష్ రావు,వివిధ పాఠశాల పీడీలు పీఈటీలు, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

'అల్లూరు బార్ రామ్మూర్తికి కైవసం

ప్రజాశక్తి-కోవూరు: ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని అల్లూరులో గురువారం నిర్వహించిన లక్కీ డిప్లో జి. రామ్మూర్తి పేరు రావడం జరిగిందని ఎక్సైజ్ సిఐ కిషోర్ తెలిపారు. ఈ మేరకు కార్యాలయంలో గురువారం ఆయన మాటా ్లడుతూ మొత్తం ఈ బారుకు 4 దరఖాస్తులు రాగా..కలెక్టర్ ఆధ్వర్యంలో తీసిన లక్కీ డిప్లో జి. రామ్మూర్తికి వచ్చిందన్నారు. అదే విధంగా కోవూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని యల్లాయ పాలెం గ్రామంలోని దాసరి పాలెం బస్‌షెల్టర్ వద్ద 7 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు.

పోషకాహారంపై అవగాహన

ప్రజాశక్తి - లింగసముద్రం

రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమం లింగసముద్రంలోని సచివాలయం -1 లో గురువారం నిర్వహించారు. ఐవైసిఎఫ్ కార్యక్రమం నిర్వహించి తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే ఆహారం గురించి వివరించడం జరిగింది. పౌష్టికాహారాన్ని వండి తల్లులకు చూపించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రమేష్ మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. అనంతరం పాలు గుడ్డు, నూనె, బాలామతం వంటివి తల్లులకు, గర్భిణీలకు అందజేశారు. ఆరోగ్య కేంద్రం సి హెచ్ ఓ శ్రీనివాసులు సూపర్వైజర్ రాధాదేవి అంగన్వాడీ టీచర్లు ప్రభావతి, రమాదేవి, పరిమ కష్ణకుమారి ఉన్నారు.

ప్రజాశక్తి -ఉలవపాడు

8వ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని కరేడు,వీరేపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చక్కెర నూనె వినియోగం- అవి అతిగా వాడితే వచ్చే అనర్ధాలపై అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా వైద్యాధికారి అనిల్ కుమార్ పాల్గొని మాట్లాడారు. చక్కర నూనె వినియోగం గురించి వాటి వల్ల పిల్లలకు వచ్చే నష్టాలు గురించి ఆయన అవగాహన కల్పించారు. సి.డి.పిఓ. మాధవి లత, కరేడు ,వీరేపల్లి సూపర్వైజర్లు నాగలక్ష్మి, రమాదేవి, హెల్త్ సూపర్వైజర్లు, ఎం. ఎల్. హెచ్ హెచ్.పిలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



గుడ్లూరు రూరల్‌లో



లింగసముద్రంలో

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్

గుడ్లూరు మండలం చెమిదిదపాడు పంచాయతీలోని తెట్టుగ్రామంలో ఉలవపాడు ప్రాజెక్ట్, సిడిపిఓ మాధవి లత ఆదేశాల మేరకు పోషకాహారంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సూపర్‌వైజర్ కామేశ్వరి మాట్లాడుతూ చిన్నపిల్లలకు .శిశువులకు పౌష్టికాహారమైన .మునగాకు. కరివేపాకు. ఆకుకూరలు. కోడిగుడ్లు. పాలు, అనేక రకాల పౌష్టిక ఆహారాన్ని ఏ విధంగా అందించాలో వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఎ. ఈశ్వరి.జె. పద్మశ్రీ. పి. రజిత. గ్రామ సర్పంచ్ హైమావతి. హెల్త్ డిపార్ట్మెంట్ సూపర్వైజర్ . కే .శైలజ తదితరులు ఉన్నారు.

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరుఐసిడిఎస్ ప్రాజెక్టు ఎ సెక్టార్ లోని వాసవి నగర్ అంగన్వాడీ కేంద్రంలో సిడిపిఓ ఉషారాణి ఆధ్వర్యం లో సూపర్ వైజర్ ఎస్‌కె షకీలా బేగం పౌష్టికాహార మాసొస్తవాలు జరిపింది. సిడిపిఓ ఉషారాణి మాట్లాడుతూ స్థూలకాయం ఉన్నపిల్లల కు నూనె, చక్కెర వాడక తగ్గించాలని, చిరుధాన్యాలను ఎక్కువగా ఉపయోగించాలని తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలు సునీత ,ఈశ్వరమ్మ ,హసీనా, ఇర్ఫాన, మెరమ్మ ,స్నేహలత, సుజాత పాల్గొన్నారు.

కందుకూరు ప్రాజెక్ట్ అర్బన్ బి సెక్టరు అత్తారువారి వీధిలో అంగన్వాడీ కేంద్రం నందు సి డి పి ఓ కే ఉషారాణి ఆదేశాల మేరకు పోషణ మాహ్ కార్యక్రమం నిర్వహించారు. సూపర్ వైసర్ యల్ లక్ష్మి దేవి మాట్లాడారు. అంగన్వాడీ కార్యకర్తలు ఎస్.కె నూర్జహాన్, ఎస్.కె రహంతున్నిషా ఎస్ కే నసీమ,ఎస్ కే జరీనా, ఎస్ డి రెహానా, తల్లులు పాల్గొన్నారు.

వాహన మిత్ర' కోసం దరఖాస్తులు

ప్రజాశక్తి-నెల్లూరు:ఆటో, మాక్సీ క్యాబ్ వాహన యజమానులు "వాహన మిత్ర" పథకం కోసం సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19వ తేదీలోగా దరఖా స్తులను అందించాలని ఆయన సూచిం చారు. రిజిస్ట్రేషన్ కార్డ్, పర్మిట్, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, ఫిట్ నెస్ మొదలైన సర్టిఫికెట్లతో దరఖాస్తులు అందించా లన్నారు. బ్యాంక్ అకౌంట్ కి ఆధార్ ఎన్‌పిసిఐ లింక్ చేసుకోవా లన్నారు. గతంలో (2023 వరకు) ఈ పథకం కోసం దరఖాస్తు చేసిన వారు మరలా దరఖాస్తు చేయావల్సిన అవసరం లేదని, వారు మాత్రమే సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

ముందస్తు జాగ్రత్తలతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-నెల్లూరు

వాతావరణ పరిస్థితులు మారే కొద్దీ వ్యాధుల ఉధతి కూడా పెరుగుతుందని, ముఖ్యంగా శీతాకాలం, వేసవి కాలంలో కొన్ని వ్యాధులభారి ప్రజలు పడతారని, వాటి నివారణ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో సంపూర్ణ ఆరోగ్యంతో సంతోషంగా జీవించడం సాధ్యమౌతుందని మెడికవర్ వైద్యశాల డాక్టరు పి.విజయ్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ శీతాకా లంలో , వేసవిలో ఎక్కువగా వచ్చే వ్యాధులు వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. శీతాకాలంలో ఎక్కువగా ఫ్లూ కేసులు నమోదు అవుతాయన్నారు. దగ్గు, జ్వరం, గొంతునొప్పి వంటివి ప్రధాన లక్షణాలన్నారు. చేతులను క్రమంగా శుభ్రం చేసుకుంటూ, జనసమర్ధవంతమైన ప్రదే శాలలో ఎక్కువ సమయం గడపకుండా జాగ్ర త్తలు తీసుకుంటే ఫ్లూ ను జయించ



వచ్చున్నారు. అలాగే టైఫాయిడ్ కూడా ఈ కాలంలో విస్తరిస్తుంది. దీర్ఘకాలిక జ్వరం, తలనొప్పి, కడుపు నొప్పి దీని లక్షణాలు. టైఫాయిడ్ నివారణ కోసం తాగునీరు పరిశుభ్రంగా ఉంచుకోవాలి, బయట ఆహారం తీసుకోవడం తగ్గించాలి. వైద్యుల సలహా తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఇక వేసవిలో ఎక్కువగా వచ్చే వ్యాధులు వడదెబ్బ ఒక ప్రధాన సమస్య. దీని వల్ల అధిక జ్వరం, నీరసం, తలనొప్పి, మూర్ఛ వంటి లక్షణాలు వస్తాయి. దీన్ని నివారించాలంటే ఎక్కువ వేడిలో బయట తిరగకుండా ఉండాలి. శరీరానికి తగినంత నీరు అందించాలి, చల్లని ప్రదేశంలో విశ్రాంతి తీసుకోవాలన్నారు. డీహైడ్రేషన్ వేసవిలో సాధారణ సమస్య. అలసట, పొడి నోరు, మూత్రం తగ్గడం దీని లక్షణాలు. ఈ సమస్య రాకుండా రోజంతా నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ తీసుకోవాల న్నారు.ఇంకో పెద్ద సమస్య డయేరియా, కాలరా ఇవి ప్రధానంగా కలుషిత నీరు, ఆహారం వల్ల వస్తాయి. విరేచనాలు, వాంతులు, నీరసం ఇవి ప్రధాన లక్షణాలు. వీటిని నివారించడానికి పరిశుభ్రమైన నీరు మాత్రమే తాగాలి, ఆహారాన్ని శుభ్రంగా ఉంచాలన్నారు.ప్రతి సీజన్‌లోనూ వచ్చే వ్యాధులను చిన్నచూపు చూడరాదు. పరిశుభ్రత పాటించడం, తగినంత నీరు మరియు పోషకాహారం తీసుకోవడం, డాక్టర్ల సూచనలు పాటించడం ద్వారా సీజనల్ వ్యాధులను సులభంగా నివారించవచ్చు. ఆరోగ్యం

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి-కోవూరు

: మండలం పోతిరెడ్డిపాలెం గ్రామంలోని తిప్ప గిరిజన కాలనీలో బుధవారం రాత్రి అగ్ని ప్రమా దం చోటు చేసుకుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణ ంగా ఒక చిన్న ఇల్లు మంటల్లో ఆహుతైంది. ఆ సమయంలో యజమాని దంపతులు రోజు వారీ కూలీ పనుల నిమిత్తం గ్రామంలో ఉండగా ఈ దుర్ఘటన జరిగింది.ఇంటి అంతర్గతంగా ఉన్న సామాన్లు, దుస్తులు, గిన్నెలు అన్నీ మంటల్లో దగ్ధమయ్యాయి. దినసరి కూలీలు కష్టపడి సంపాదించి బీరువాలో దాచు కున్న నగదు కూడా బూడిదై పోయింది.

దాంతో బాధితులు కన్నీరు మున్నీరై విలపించారు.ఈ ఘటన గురించి తెలుసుకున్న తెదేపా నాయకులు తిరువూరు అశోక్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5,000 నగదు సహాయం, 10 కిలోల బియ్యం అంద జేశారు. స్థానిక ప్రజలు కూడా కుటుం బానికి అండగా నిలిచి తక్షణ సాయం అందిం చాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

"సింహపురి" విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు



స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్.జి.ఎఫ్) పోటీలలో తోటప ల్లిగూడూరు మండలం, పేడూరు గ్రామంలోని ఇంటర్నేష నల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు వివిధ భాగా లలో అత్యంత ప్రతిభను ప్రదర్శించారు. వివరాల మేర కు.. మండలంలోని చిన్నచెరుకూరు జిల్లా పరిషత్ ఉన్న త పాఠశాల ఆటల మైదానంలో గురువారం ఎస్.జి.ఎఫ్ క్రీడా జట్ల ఎంపికలు జరిగాయి. పోటీలను మండల వి ద్యాశాఖ అధికారి సన్నపురెడ్డి వేణుగోపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ పోటీలలో సింహపురి ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నుంచి 9, 10వ తరగతి విద్యార్థి ని, విద్యార్థులు కబడ్డీ పోటీల్లో పాల్గొన్నారు. అండర్ 4 సంవత్సరాలలోపు విభాగంలో బాలికలు సాత్విక, దిషి త, పుష్పలత, రిషిత అత్యంత ప్రతిభను ప్రదర్శించి ప్రథమ స్థానంలో నిలిచారు. అండర్ 17 సంవత్సరా లలోపు విభాగంలో బాలబాలికలు ఇద్దరు మేఘన, తేజ స్విని మండల జట్టుకి ఎంపిక అయ్యారు. ఎస్.జి.ఎఫ్ పోటీలలో ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులను స్కూల్ చైర్మన్ దగ్గు శివకుమార్, విజాత, ప్రధానోపా ధ్యాయులు విజయలక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయుడు హేమంత్, స్కూల్ సిబ్బంది అభినందించారు. భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర, జాతీ య, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించాలని ఆకాంక్షించారు.

రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియో చెల్లించాలి

ప్రజాశక్తి ఆత్మకూరు అర్బన్

కూటమి ప్రభుత్వ ధన దాహానికి రెండు దళిత కుటుంబాలు ఛిన్నాభిన్నమై రోడ్డున పడ్డాయని, వారి ఇసుక దాహానికి రెండు కుటుంబాలకు చెందిన ఏడుగురు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డారని వారికి రూ.50 లక్షల చొప్పున ఇసుక కాంట్రాక్టర్ల ద్వారా చెల్లించేలా చూడాలని వైసిపి నాయకులు డిమాండ్ చేశారు. ఆత్మకూరు మాజీ ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి సూచనలతో పట్టణంలోని పార్టీ కార్యాలయంలో వైసిపి నాయకులు గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి పట్టణ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్ రెడ్డి, ఎస్‌సిసెల్ రాష్ట్ర కార్యదర్శి కొండా వెంకటేశ్వర్లు, నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు నందా ఓబులేసు, శాప్ మాజీ డైరెక్టర్ కాలువ నరసింహులు మాట్లాడారు. జరిగిన రోడ్డు ప్రమాదం దృశ్యాలు చూస్తే హృదయ విదాకరంగా ఉన్నాయని, ఎలాంటి అనుమతులు లేని రీచ్‌ల నుండి



మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ఇసుకను అక్రమంగా తరలించడం, ఇష్టా రాజ్యాంగా ఇసుకను అమ్ముకోవడమే టిడిపి ప్రభుత్వం చేస్తుందన్నారు. అనధికార ఇసుక తరలింపు వాహనం ఢీకొనడంతో వరామర్శకు వస్తున్న రెండు కుటుంబాలకు చెందిన ఏడుగురు ప్రమాదంలో మృత్యువాత పడ్డారని తెలిపారు. ప్రభుత్వం సంబంధిత వాహన యజమాని ఇప్పటి వరకు సంతాపాలతో కాలం వెళ్లదీస్తున్నారని, ఆ కుటుంబాల భవిష్యత్తు కోసం రూ.50లక్షల చొప్పున చెల్లించాలన్నారు. ఆ కుటుంబాల్లో అర్హత ఉన్న వారికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఇంత ఇసుక అక్రమ దందా జరుగుతున్న సంబంధిత అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ నిద్రావార్థలో మునిగి ఉన్నారా అని వారు ప్రశ్నించారు. ఈ మాఫియాకు అమాయకులైన ప్రజలు బలవుతున్నారని, ఇకనైనా కూటమి ప్రభుత్వం రంగంలోకి దిగి తగువైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. గత ఏడాది మర్రిపాడు వద్దనున్న అతి పెద్ద డంపింగ్ యార్డులో ఇసుక రోజుల వ్యవధిలో మాయమైందని, ప్రస్తుతం ఇనుక తరలింపునకు తవ్వకాలకు అనుమతులు లేకున్నా దర్జాగా అక్రమ రవాణా చేస్తున్న తీరుపై అధికారులు కఠిన చర్యలు చేపట్టాలని వారు కోరారు. కార్యక్రమంలో వైసిపి మున్సిపల్ విభాగ రాష్ట్ర కార్యదర్శి అల్లారెడ్డి ఆనందరెడ్డి, మండలాల కన్వీనర్లు బిజివేముల పిచ్చిరెడ్డి, పులగం శంకర్ రెడ్డి, చెన్ను వెంకటేశ్వరరెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పులిమి రమేష్ రెడ్డి, ఆనంతసాగరం వైస్ ఎంపిపి పాణెం శ్రీనివాసులు, తోడేటి మణి, అశోక్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలల్లో తనిఖీలు

ప్రజాశక్తి - ఉదయగిరి

మండల విద్యాశాఖ అధికారి టి.వెంకటేశ్వర్లు మండల ప్రజా పరిషత్ మాసాయిపేట మెయిన్, ఉర్దూ పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. అందులో భాగంగా విద్యార్థిని విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి ఆన్లైన్ అటెండెన్స్, అసెస్మెంట్ బుక్స్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తపరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనంను రుచికరంగా అందించాలని ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరుంధతి, హాజీర ఉపాధ్యాయినీ అనురాధ పాల్గొన్నారు.



ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషకమాసం

ప్రజాశక్తి-కావలి

8వ రాష్ట్రీయ పోషక మాసం సందర్భంగా కావలి రూరల్ మండలం తుమ్మలపెంట సెక్టార్ పెదనట్టు గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఐ.సి.డి.ఎస్. సూపెర్‌వైజర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో పోషకాహారంపై అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల్లో స్థూలకాయం ఉంటే వారు తినే ఆహారంలో, చక్కెర, నూనెలు తగ్గించాలని తెలిపారు. బరువు తక్కువగా ఉన్న పిల్లలకు 2 గంటలకోసారి ఆహారం తినిపించాలన్నారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పాలు, గుడ్లు, ఆహారంలో తినిపించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎం.ఎస్.కె.రాఘవి, అంగన్‌వాడీ కార్యకర్తలు జయలక్ష్మి, సంతోషం పాల్గొన్నారు.



ఉప ఖజానా కార్యాలయంలో తనిఖీ

ప్రజాశక్తి-ఉదయగిరి

ఉప ఖజానా కార్యాలయాన్ని జిల్లా ఖజానా డిప్యూటీ డైరెక్టర్ డి గంగాద్రి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగ సూచనలు సలహాలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వార్షిక తనిఖీల్లో భాగంగా ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. రికార్డులు నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఉద్యోగులు, పెన్షనర్లపై మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ సకాలంలో సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ టి ఓ ఉస్మాన్, సీనియర్ అసిస్టెంట్లు ఎం.శ్రీనివాసులు, బి. ప్రసాద్ పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఇఒ

క్రీడా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయిలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ అనంతలక్ష్మి అన్నారు. ఈ క్రీడలను ఎంఇఒ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అండర్ - 14, అండర్ - 17 బాల బాలికలు పాల్గొన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, యోగ, అథ్లెటిక్స్ అంశాలలో క్రీడలు జరిగాయి. మండల స్థాయిలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు, గురుకుల పాఠశాలల 250మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు డివిజన్ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో మండల కో ఆర్డినేటర్ కె.వి.కృష్ణ, మండలంలోని అందరూ వ్యాయామ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తహశీల్దారుతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు కాకు వెంకటయ్య

రీ సర్వే ఇబ్బందులపై ఆందోళన

ప్రజాశక్తి-ఉదయగిరి

జరిగిన రీ సర్వేలో పేదల ప్రభుత్వ భూములు పెద్దలకు మారాయే తప్ప అసలైన లబ్ధిదారులకు అన్యాయం జరిగిందని ఎపి రైతుసంఘం నాయకులు కాకు వెంకటయ్య లబ్ధిదారులతో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం తహశీల్దార్ ఎల్.రామ్మోహన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన తహశీల్దార్ ఎదుట రైతులతో బైఠాయించి మాట్లాడుతూ అర్హత కలిగిన రైతులు జరిగిన రీ సర్వేతో ఎల్‌పిసి నెంబర్లతో నోషనల్ ఖాతా నెంబర్లతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యంగా రైతులు ప్రభుత్వ అందిస్తున్న రైతు భరోసా ఎందుకో లేకపోయామని వేసిన పంటకు ఈ కెవైసి చేయించుకోలేకపోతున్నామని బ్యాంకుల్లో నగదు రుణాలను రీ షెడ్యూల్ చేసుకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో భూ పంపిణీలో అర్హత కలిగిన లబ్ధిదారులకు ప్రభుత్వ భూమి ఇచ్చారని వాటికి పాసుపుస్తకాలు మాత్రమే ఉండడంతో బ్యాంకర్లు ఆనాడు నగదుపై లోన్లు ఇచ్చారని ఇప్పుడు అవి రీ షెడ్యూల్ కాక 1బి అడంగల్ కావాలంటూ దౌర్జన్యాలు చేస్తున్నారన్నారు. జరిగిన రీ సర్వేలో 320 తప్పులు జరిగాయని దాంతో రైతులు ప్రభుత్వ పథకాలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని గ్రామంలో రిజిస్ట్రేషన్ భూములు మారేతప్ప పేదలకు ఇచ్చిన భూములు తప్పిదాలికే పరిమితమై పేదలకు ఇచ్చిన ప్రభుత్వ భూమి పెద్దలకు మాత్రం దర్జాగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తహశీల్దార్ జరిపిన రీసర్వేతో ఈ తప్పిదాలు అధికమయ్యాయన్నారు. వెంటనే పంచాయతీలో నెలకొన్న సమస్యలపై జిల్లా ఉన్నత అధికారులు రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి సమస్యలు పరిష్కరించాలని కోరారు. వెంటనే స్పందించిన తహశీల్దార్ ఎల్.రామ్మోహన్ రైతు సమస్యల వివరాలను తెలిపితే ప్రత్యేకంగా తాను విఆర్ఒ, సర్వేర్లతో రికార్డులను పరిశీలించి గ్రామం కొచ్చి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

నిరంకుశ విధానాలు విడనాడాలి

ప్రజాశక్తి-వింజమూరు

ఉద్యోగ, ఉపాధ్యాయులపై ప్రభుత్వం అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని సమస్యల పరిష్కరించకుండా హామీలు అమలు చేయడం లేదని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక వింజమూరు పంచాయతీ బస్టాండ్ వద్ద యుటిఎఫ్ రణభేరి ప్రచార జాతకు నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున స్కూటర్ ర్యాలీ నిర్వహించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు కావస్తున్న పిఆర్‌సి ఐఆర్ డిఎ ఇంతవరకు ప్రకటించలేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే 27వ తేదీన చలో విజయవాడ



మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

కార్యక్రమం కచ్చితంగా నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు శేషులు, చలపతి శర్మ, వెంకటేశ్వర్లు, ఖాజావలి, బాలరాగయ్య, చెంచలబాబు, మండల నాయకులు వెంకటేశ్వర రెడ్డి, వీరాంజనేయులు, పరమేశ్వరరావు, భారీగా కార్యకర్తలు పాల్గొన్నారు.

యూరియా వాడకంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని ఖాదర్ పూర్ గ్రామంలో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారిణి ఎన్.కవిత నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ యూరియా అధికంగా వాడడం



యూరియా వాడకంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

వల్ల పొలంలో భూసారం తగ్గి చౌడు భూములుగా మారే అవకాశం ఉందన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించి పచ్చి రొట్ట విత్తనాలు లేదా నవధాన్యాలు వేసి భూమిలో కలయిదున్నితే యూరియా వాడకాన్ని తగ్గించి భూసారాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ అన్నవరపు కృష్ణారెడ్డి, మండల విస్తరణ అధికారి వెంకటేశ్వర్లు, ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌ఛార్జ్ బాలకిశోర్, ఐసిఆర్ పిలు నవ్య, వెంకటసుధ, రైతులు పాల్గొన్నారు.

మహిళలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలి

ప్రజాశక్తి-బిట్రగుంట

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మహిళల సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని లక్ష్యంతో ఉచిత మెడికల్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు కోవూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ జిహారిక పేర్కొన్నారు. స్వస్థ నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలు సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రభుత్వం ఉచిత మెడికల్ క్యాంపెయిన్‌ను బోగోలు సచివాలయం -1 గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జిహారిక మాట్లాడుతూ మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 17 తారీకు నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు మండలంలో ఉన్న అన్ని పిహెచ్‌సి సెంటర్‌లో ఉచిత



మెడికల్ క్యాంపులు నిర్వహించి మహిళలకు రొమ్ము కేన్సర్, గుండె జబ్బులు, మధుమేహం, గర్భాశయ కేన్సర్, నోటి క్యాన్సర్ అన్ని టెస్టులను నిర్వహించి వారికి కావాల్సిన మందులను ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. 0-5 సంవత్సరాల పిల్లలు, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, నాగులవరం పిఎసిఎస్ చైర్మన్ చిలకపాటి వెంకటేశ్వర్లు, కావలి డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ బిజిత, తహశీల్దార్ నాసా శ్రీనివాసులు రెడ్డి, ఎంపిడిఒ సుబ్రహ్మణ్యం, ఆరోగ్య సిబ్బంది పాపారావు, అంగన్‌వాడీ కార్యకర్త సుప్రజ, మహిళలు, గర్భిణులు, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్

ఇళ్ల నిర్మాణాలు పరిశీలన

ప్రజాశక్తి-అనంతసాగరం

మండలంలోని గౌరవరం గ్రామంలో జరుగుతున్న హౌసింగ్ నిర్మాణాలను ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్ పరిశీలించారు. ప్రతిఒక్కరూ ప్రభుత్వం అందజేసిన గృహ నిర్మాణ పథకం ద్వారా ఇళ్లు నిర్మించుకుంటున్న వారు త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ప్రతి లబ్ధిదారునికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గృహ నిర్మాణాలకు సంబంధించి 90 రోజుల పని దినాలను కేటాయించి ఆ వేతనానికి సంబంధించిన నగదును వారి అకౌంట్లో జమ చేస్తామని తెలిపారు. హౌసింగ్ ఎఇ లబ్ధిదారులతో మాట్లాడుతూ ఎస్‌సి, బిసి, మైనారిటీలకు ప్రభుత్వం రూ.50వేలు అదనపు సహాయము, ఎస్‌టిలకు రూ.75 వేలు అదనపు సహాయం అందజేస్తున్నందున ఈ అవకాశంను ఉపయోగించుకొని మండలంలోని ప్రతి లబ్ధిదారుడు గృహ నిర్మాణాలను వెంటనే పూర్తి చేసుకోవాలని సూచించారు. వీరివెంట హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, లబ్ధిదారులున్నారు.

పొగాకు బేళ్లు కొనుగోలు

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని డిసిపల్లి పొగాకు వేలం కేంద్రానికి రైతులు 730బేళ్లను వేలానికి తీసుకురాగా వీటిలో 495బేళ్లను పలు కంపెనీ ప్రతినిధులు కొనుగోలు చేశారని వేలం నిర్వహణా ధికారి రాజశేఖర్ తెలిపారు. వివిధ కారణాలతో 229బేళ్లను తిరస్కరించారన్నారు. వాటిలో ఎన్ఎస్ 81 ఎన్‌బి 134, ఆర్ఆర్ 09, సిఆర్ 05 ఉన్నాయన్నారు. అధిక బరువుతో ఉన్న 06బేళ్లను వేలానికి అనుమతించలేదన్నారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.344 కాగా కనిష్ఠ ధర రూ.100, సగటు ధర రూ.186.97 ఈ వేలంలో 10మంది కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నట్లు తెలియజేశారు.



భోజన ప్యాకెట్లు వితరణ

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణం నివాసులు కీ.శే. కందికట్టు.కోటేశ్వరరావు 16వ వర్ధంతి సందర్భంగా గురువారం వారి తమ్ముడు, మరదలు పాత్రికేయులు కందికట్టు. నారాయణ – శ్యామల సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ద్వారా తుఫాన్ నగర్లోని పేదలకు భోజనం ప్యాకెట్లు వితరణ చేయించారు. ఈ సందర్భంగా సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ "మీరు మమ్ము వదిలిపోయి నా మీ ధ్యాస మేము మరువలేము" అంటూ పాత్రికేయులు కందికట్టు నారాయణ వారి అన్నయ్య జ్ఞాపకార్థంగా గత కొన్ని సంవత్సరాలుగా పేదలకు తమ సంస్థ ద్వారా పేదలకు అన్నదానం చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా మా సంయుక్త సేవా సంస్థ ద్వారా పేదలకు ఆకలి తీరుస్తున్న దాతలు కందికట్టు నారాయణ – శ్యామల దంపతులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ ఉన్నామని తెలిపారు.

'రణభేరి జాతా'కు యుటిఎఫ్ స్వాగతం

ప్రజాశక్తి-కావలి



ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యు.టి.ఎఫ్.) రాష్ట్రశాఖ సూచనలు మేరకు యు.టి.ఎఫ్. కావలి ప్రాంతీయ మండల శాఖల ఆధ్వర్యంలో గురువారం ఉదయం కావలి పట్టణం దక్షిణ శివారులోని బృందావనం కాలనీ సమీపంలో ఉన్న హీరో షోరూం దగ్గర నుండి ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యు.టి.ఎఫ్) "రణభేరి ప్రచారజాత" బైక్ ర్యాలీకి యు.టి.ఎఫ్. నాయకులు ఘన స్వాగతం పలికారు. అక్కడ ప్రారంభమైన జాతా కావలి పట్టణం ఉత్తర శివారులోని భాష్యం స్కూల్ వరకు నిర్వహించారు. ఈ ప్రచారజాతాలో నాయకులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయుల, ఉద్యోగుల ఆర్థిక బకాయిలు చెల్లించాలని, ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలు రద్దు చేయాలని కోరారు. పి.ఆర్.సి. కమిటీని వెంటనే నియమించాలని, ఉద్యోగులకు 30శాతం ఐ.ఆర్. ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇతర ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలు ఉపసంహరించాలని తదితర విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు, జిల్లా గౌరవాధ్యక్షులు కిలారి వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వి. చలపతి శర్మ, కార్యదర్శులు ఐ.హెచ్.ఎల్. ప్రసాద్, బి.మాధవరావు, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యురాలు బి.శ్రీదేవి, అన్ని మండలాల బాధ్యులు, సీనియర్‌నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి..

ప్రజాశక్తి-ఇందుకూరుపేట



నివాళులర్పిస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులు

సంగం మండలం పెరమన గ్రామం వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలను కోవూరు ఎంఎల్‌ఎ ప్రశాంతి రెడ్డి స్పందించి ఆదుకోవాలని సిఐటియు మండల గౌరవాధ్యక్షులు ఎస్‌కె చాన్‌బాషా డిమాండ్ చేశారు. గురువారం ఇందుకూరుపేటలోని బాధిత కుటుంబాన్ని సిపిఎం టివివి ప్రసాద్, మారుబోయిన రాజా, ఆటో యూనియన్ సభ్యులతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా సిఐటియు గౌరవ అధ్యక్షులు చాన్‌బాషా మాట్లాడుతూ చనిపోయిన కుటుంబానికి సిపిఎం అండగా ఉంటుందన్నారు. నెల్లూరు రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ముఖ్యమంత్రితో మాట్లాడి చనిపోయిన వారికి ఒక్కొక్కరికి రూ.5లక్షల ఆర్థిక సహాయం ప్రకటించిన శ్రీధర్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. చనిపోయిన వారిలో ఇద్దరు భార్యాభర్తలు ఇందుకూరుపేటకు చెందిన వారు కాబట్టి కోవూరు నియోజకవర్గ ఎంఎల్‌ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి స్పందించి బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందించాలని డిమాండ్ చేశారు. వారి పిల్లలను అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆయన తెలిపారు. సిపిఎం, సిఐటియు ఆ కుటుంబానికి ఎప్పుడు అండగా నడుస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు మనోహర్, దయాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎడిఎ దేవసేన

భూసార పరీక్షలపై అవగాహన

ప్రజాశక్తి-సంగం

మండలంలోని బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, జెడ్‌పి హైస్కూల్‌లో విద్యార్థిని విద్యార్థులకు భూసార పరీక్షలపై శిక్షణా కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఎడిఎ దేవసేన మాట్లాడుతూ పంటలకు అవసరమైన పోషకాల గురించి వివరించి వాటి ఉపయోగాల గురించి తెలియజేశారు. విద్యార్థులందరూ కూడా వారి తల్లిదండ్రులకు వ్యవసాయం చేసేటప్పుడు తప్పనిసరిగా భూసార పరీక్ష ఫలితాలు ఆధారంగా మాత్రమే ఎరువులను వాడాలని తెలియజేయాలని కోరారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త అనూష మాట్లాడుతూ మట్టిలో ఉన్న రకాలు గురించి మరియు వివిధ రకాల మట్టి భౌతిక స్థితుల గురించి వివరిస్తూ వాటి నమూనాలను చూపించారు. భూసార పరీక్ష కేంద్రం నెల్లూరు వ్యవసాయ అధికారిని ఇంద్రావతి మాట్లాడుతూ మట్టి పరీక్షలను చేసే విధానం గురించి వివరిస్తూ మట్టిలో ఉన్నటువంటి ఈ పోషకాల ఆధారంగా వాటి నాణ్యత ప్రమాణాలను గురించి తెలియజేశారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సుమతమ్మ, జెడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పి.బుజ్జయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం సంగం సొసైటీలో రైతులకు భూసార పరీక్ష ఫలితాలు ఆధారంగా ఎరువులు వేసుకోవాలని రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు శ్రీనివాస యాదవ్, షేక్ బాబు, పిఎసిఎస్ సిఇఒ దస్తగిరి, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా..

ప్రజాశక్తి-అనంతసాగరం

మండలంలోని మంచాలపల్లి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి ఎస్‌సి కాలనీకి గురువారం నుండి మంచినీటి ట్యాంకర్ ద్వారా నీళ్ల సరఫరా చేస్తున్నారు. సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో స్థానిక సమస్యలైన, మంచి నీటిపై సోమవారం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు గురువారం ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. పోరాడితే స్థానిక సమస్యలు పరిష్కారం అవుతాయని సిపిఎం నాయకులు అన్నారు.



వైద్య సేవలందిస్తున్న డాక్టర్లు

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-ముత్తుకూరు

ఎడిబుల్ ఆయిల్ ట్రాన్స్ పోర్ట్ అసోసియేషన్ కృష్ణపట్నం పోర్ట్ రోడ్‌లో గురువారం భారత్ పెట్రోల్యూమ్ వారి ఉచిత హెల్త్ క్యాంపు నిర్వహించారు. డ్రైవర్, హెల్పర్లకు ఉచిత ఆరోగ్య పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అసోసియేషన్ ప్రెసిడెంట్ రామ్మోహన్ రెడ్డి విచ్చేశారు. కార్యక్రమంలో భారత్ పెట్రోలియం అధికారులు వీల్ సుబ్రహ్మణ్యం, సంతోష్ కుమార్ పాల్గొన్నారు. కంటి పరీక్షలను ఎల్ వి ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆరోగ్య పరీక్షలు, పైన్ హాస్పిటల్ నెల్లూరు వారు నిర్వహించారని తెలియజేశారు.



చిన్నారులతో మాట్లాడుతున్న మాలకొండయ్య

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

ప్రజాశక్తి-కావలి

సమాజంలో బాలకార్మికులు పెరుగుతున్నారని, దాని కోసం పౌర సంస్థలు నిరంతరం కృషి చేసి, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించి, బాలల భవిష్యత్తు బంగారు భవిష్యత్తు అని లోక్ అదాలత్ సభ్యులు ఎం.మాలకొండారెడ్డి పేర్కొన్నారు. బడి బయట పిల్లలను పాఠశాలలో చేర్పించాలని కోరారు. తల్లిదండ్రుల అవగాహన లోపం వల్ల వీధిలో తిరుగుతున్న బాల బాలికలను పాఠశాలలో చేర్పించి, విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి లెక్కలేనన్ని చట్టాలు అమల్లో ఉన్నప్పటికీ బాల కార్మిక వ్యవస్థ పెరుగుతూనే ఉందన్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు పౌర సంస్థలు కలిసికట్టుగా కృషి చేసి బాలల హక్కులను పరిరక్షించి, బాలబాలికలను పాఠశాలకు పంపాలని కోరారు. సమాజంలో బాల బాలికలను హోటల్లో గానీ, ఫ్యాక్టరీల్లో గానీ, షాపుల్లో గానీ పని చేయించుకోవడం నేరమన్నారు. విద్యాహక్కు చట్టంపై ప్రజలకు అవగాహన పెంపొందించి, బాలబాలికలను ఉన్నత విద్యను అభ్యసించడానికి ప్రోత్సహించాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. దాని కోసం మేధావులు, ఉద్యోగులు, తల్లిదండ్రులు, నిరంతరం కృషి చేయాలన్నారు.



'పి.ఎం.ఎ.వై. అంగీకార్' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కావలి

ప్రధాన్ మంత్రి ఆవాజ్ యోజన 2.0 హౌసింగ్ పథకం పోస్టర్‌ను కావలి మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పి.ఎం.ఎ.వై. 2.0 అర్బన్ ఆవాస్ దినం సందర్భంగా ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన 2.0 హౌసింగ్ పథకం పోస్టర్లను ఆవిష్కరించడం జరిగిందన్నారు. పిఎంఎవై, 2.0 హౌసింగ్ పథకం పైలెట్ మంజూరయ్యేట్లు చూడడం, లోన్ వచ్చే అవకాశం లేని వారికి ఒకేసారి కట్టుకునే విధంగా అవగాహన కల్పించడం, రిజిస్ట్రేషన్ అయి, పై ప్రజల్లో అంగీకార్ ప్రోగ్రాం ద్వారా అవగాహన కల్పించి, అర్హులైన లబ్ధిదారులకు లబ్ధి చేకూరే విధంగా ప్రయత్నం చేయడం జరుగుతుందన్నారు. ఇదివరకే గృహం మంజూరై, లోన్ వచ్చి, రిజిస్ట్రేషన్ చేసుకోనివారికి అవగాహన కల్పించి, రిజిస్ట్రేషన్ చేయించడం, ఇంకనూ లోన్ రానివారికి లోన్‌మేళా నిర్వహించి, లోన్ వచ్చే విధంగా చూడడం, రిజిస్ట్రేషన్ అయి, మార్టిగేజ్ అయ్యి, ఇంకనూ ఇళ్ళు చేరని వాళ్ళకు అవగాహన కల్పించి, సామూహిక గృహ ప్రవేశాలు చేయించడం, పూర్తి అయిన టిడ్కో గృహ సముదాయాల్లో చెట్లు నాటించడం వంటివి చేస్తారని తెలిపారు.

రామిరెడ్డి సతీమణికి జూపూడి పరామర్శ

ప్రజాశక్తి-కావలి

వై.సి.పి. మాజీ సోషల్ జస్టిస్ మినిస్టర్ జూపూడి ప్రభాకర్ మాజీ ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి సతీమణి ఆదిలక్ష్మిని పరామర్శించారు. అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న పి-4 విధానాన్ని సున్నితంగా తిరస్కరించారు. పదవులు ఎవరికీ శాశ్వతం కాదని ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ఏ ప్రభుత్వమైనా పని చేయాలని ఈ సందర్భంగా జూపూడి పలు వ్యాఖ్యలు చేశారు. కావలి ప్రాంతంలోని బుడంగుంట ఎస్‌సి కాలనీలో విద్యుత్ కోతలపై తీవ్రంగా స్పందించారు. పేద ప్రజలపై దుశ్చర్యలు సమంజసం కాదన్నారు. వారినీ నీచంగా చూడక, బడా వ్యాపారస్తులు ఎగవేసిన బకాయిలను మీరు ఇదే ఫోర్స్‌తో వసూలు చేయగలరా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో కావలి వైసిపి పట్టణ అధ్యక్షులు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, కుందుర్తి కామయ్య, కుందుర్తి శ్రీను, ఆర్‌కె కృష్ణారెడ్డి, కామరాజు, గుడ్లూరు మాల్యాద్రి, పుల్లయ్య పద్మ, కళ్యాణి, కావలి రూరల్ మండల నాయకులు జంపాని రాఘవులు, కృష్ణమూర్తి, బోగోలు మండల ఇన్‌ఛార్జ్ మద్దిబోయిన వీరరఘు, దగదర్తి మండల నాయకులు కర్తం సురేందర్ రెడ్డి, తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.



మాజీ ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సతీమణిని పరామర్శిస్తున్న జూపూడి ప్రభాకర్



మా ఉద్యోగాలు ఇప్పించాలి..

- ఆయుష్ ఉద్యోగి ఆర్ లలిత

ప్రజాశక్తి-కొడవలూరు

ఆయుష్ డిపార్ట్మెంట్లో కొంతమంది ఉద్యోగులను విధుల్లో లేరనే కారణంంఎ తొలగించారని ఉన్నతాధికారులు స్పందించి తమ ఉద్యోగాలను తమకు ఇప్పించాలని ఆయుష్ ఉద్యోగి ఆర్ లలిత ప్రకటనలో కోరారు. ఇటీవల ప్రభుత్వం జిఒ ఇచ్చి తొలగించిన వారిని విధులలోకి తీసుకోవాలని చెప్పినప్పటికీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లే వ్యవహరిస్తున్నారని ఆమె వాపోయారు. ప్రభుత్వం జిఒ ఇవ్వడంతో తాము ఎంతో సంతోషించామన్నారు. ఇంతవరకు అధికారులు ఆ జిఒను ఆచరణలో పెట్టి అమలు చేయకపోవడంతో తమకు వయోపరిమితి దాటి పోతుందని తమకు చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రభుత్వం ఇచ్చిన జిఒను వెంటనే అమలు చేసి తమ ఉద్యోగాలు తమకు ఇచ్చి మిగిలిన ఉద్యోగాలను చేయాలని ప్రభుత్వం ఆదేశించిన అధికారులు పట్టించుకోవటం లేదన్నారు. ఈ విషయంపై ఆయుష్ డిపార్ట్మెంట్లో పనిచేసిన ఆర్.లలిత ఎఫ్ఎంఒ ఎన్నోసార్లు అధికారులకు ఎన్నోసార్లు విన్నవించుకున్న కానీ అధికారులు పట్టించుకోవటం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నత అధికారులు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పట్టించుకుని త్వరితగతిన రిక్రూట్‌మెంట్ ప్రాసెస్ చేయాలని ఆమె కోరారు.

రూ.2 లక్షల చెక్కు అందజేత

ప్రజాశక్తి ఆత్మకూరు అర్బన్



ఎస్ఎస్‌టి ఆర్గనైజేషన్ ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఆత్మకూరు కౌన్సిలర్స్ జూన్ నెలలో ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకం క్లెయిమ్ చేశామని అది సెప్టెంబర్‌లో సెటిల్మెంట్ అయిందని, ఆత్మకూరు సిఎఫ్ఎల్ చేసిన క్లైమ్ మండలంలోని మహిమలూరు ఎపిజిబి బ్యాంక్ మేనేజర్ ఫిరోజ్ కుమార్, ఆత్మకూరు ఆర్థిక అక్షరాస్యత కేంద్రం సమక్షంలో గురువారం కాన్సలర్స్ టి.రాజేష్ కుమార్, డి.విజయ్ కుమార్ లు కె. పెంచలస్వామి ఆ సంబంధిత కుటుంబానికి రూ.2లక్షల చెక్కును అందజేశారు. తమకు ఆ కుటుంబానికి సహాయం చేసే అవకాశం ఇచ్చిన ఎస్ ఎస్ టి సంస్థ యాజమాన్యానికి, మహిమలూరు ఎపిజిబి బ్యాంకు మేనేజర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.



మాట్లాడుతున్న దర్గా ఇఒ

గంధ మహోత్సవ ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

ఎఎస్‌పేట గ్రామంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఖాజా నాయబ్ రసూల్ దొరసానమ్మ గంధ మహోత్సవం సందర్భంగా దర్గా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18న గురువారం రాత్రి 2 గంటలకు స్వామివారి గంధ మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో, పకీరుల జరుగులతో, భక్తి సంకీర్తనలతో జరుగుతుందని అనంతరం వక్ఫ్‌బోర్డ్ వారి ఆధ్వర్యంలో గంధాన్ని భక్తులకు పంచిపెట్టడం జరుగుతుందని తెలిపారు. అనంతరం శుక్రవారం 20వ తేదీ చిరాగా దీపాలంకరణ మూడవరోజు శనివారం తహలీల్ పాతిహ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. గంథం ఎత్తే విషయంలో ఎస్‌జిఎన్ హఫీజ్ పాషా, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు వారిని సంప్రదించారు. ఎపి స్టేట్ వక్ఫ్‌బోర్డు వారిపై దావా వేయడం జరిగింది. వాదోపవాదాలు విన్న హైకోర్టు వారు, ఈ గంథం విషయమై అడిగిన కొన్ని విషయాల్లో, గంథం ఎవరు ఎత్తాలనే విషయంపై వేసిన కేసును ఆఫీస్ పాషా విత్ డ్రా చేసుకోవడం జరిగింది. కాబట్టి ఈ సంవత్సరం కూడా రాష్ట్ర వక్ఫ్‌బోర్డు తరపున గంథం ఎత్తే విషయంలో ఎస్‌బిఎన్ ఫయాజ్‌ను కోరారు. కావున ఆయనే గంథం ఎత్తడం జరుగుతుందని తెలిపారు. మిగతా రెండు రోజులు జరిగే చిరాగా, తహలీల్ పాతిహ కార్యక్రమాలు గతం సంవత్సరంలో జరిగిన మాదిరిగానే ఎస్‌జిఎన్ హఫీజ్ భాషాతో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజీజ్ ఆదేశాల మేరకు, ఏర్పాట్లను పంచాయతీ వారు, దర్గా వారి సమన్వయంతో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా సిసి కెమెరాల ఏర్పాటు, భోజన వసతి, మంచినీటి సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు.

IN THE COURT OF THE HON'BLE CHAIRMAN MACT CUM II nd ADDITIONAL CHIEF JUDGE CITY CIVIL COURT AT: HYDERABAD
MVOP. NO. 853 OF 2025

Between:
Vadthya Gemya . **...Petitioner**
AND
Srikireddy Amaravathi and Others. **...Respondents**

To,
1. Srikireddy Amaravathi,W/o.Srikireddy MuniReddy, Occ: Business / Owner of the DCM Bearing No.AP 39 UQ 3033, R/o.H.No.3-4 106, Rajagopalapuram, Naidupeta, Nellore Dist, Andhrapradesh. **....Respondent 1**
2. AbhyaKumar, S/o.Ashok Manji, Occ:Driver of the DCM Bearing No.AP 39 UQ 3033
2. C/o.Srikireddy Amaravathi W/o.Srikireddy Muni Reddy, Occ: Business/Owner of the DCM Bearing No. AP 39 UQ 3033,R/o.H.No.3-4-106, Rajagopalapuram, Naidupeta, Nellore Dist, Andhrapradesh. **....Respondent 3**

Please take Notice that the above named Petitioner has filed above O P against you and other for Compensation, Praying that the Hon'ble court for grant of compensation in favor of the petitioner. The Hon'ble Court posted the above case on 16-10-2025.at 10.30 am for your appearance either in person or through an advocate, failing which the case will be heard and decided on merits in your absence.

(BY ORDER OF COURT)
M/s. P.CHANDRAMOULI
Pandu RANGA SWAMY ,
Advocates.
Bangaru Enclave,
Kharmanghat,Hyderabad.

నెల్లూరు 3వ అదనపు జిల్లా కోర్టులో
E.P.No. 776/2022
O.S.No. 119/2009

మల్లు గిరిధర్ రెడ్డి – డిక్రీ హోల్డరు
Vs
బండా శివప్రసాద్ రెడ్డి – జడ్జిమెంటు డెట్టార్

వేలంప్రకటన

పై నంబరున డిక్రీ హోల్డరు తన డిక్రీ బాకీ రాబట్టు కొనుటకు గాను ఈ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్థిని **తేది:06-10-2025** న **ఉదయం 10.30 గం॥ల** మొదలు **సాయంత్రం 5.00 గం॥ల** మధ్య పై కోర్టులో కోర్టు వారిచే బహిరంగ వేలము వేయబడును. కావున పాట దారులు ఎవ్వరైననూ సదరు వేలం పాటలో పాల్గొనవచ్చును.

ఆస్థిషెడ్యూలు

Item No.1: Nellore Registration District - Nellore Sub Registration, Nellore City, Kothuru Panchayat, Maheswarinagar, Comprised in Sy.No:183, Nellore Bit-1, Plot No.25, Extent of 48 Ankanams and 44 Sq.ft Vacant Site, **Bounded by East:** Layout Road of 70 Feet, **South:** Nellore-Mulumudi Road of 50 Feet, **West:** The Balance of site in this plot of 70 feet and **North:** Plot No 26 of 50 feet.

DHR's Value : **Rs.22,00,000/-**
Field Assstant Value : **Rs.58,00,000/-**
Market Value : **Rs.31,77,644/-**

Item No.2: Building having the name of **Hotel Manasi and Manasi Bar and Restaurant** in Plot No.4 in Ward No.16-2 with D.No.281 Gandhi Nagar with assessment No.19884/38356 consisting of 67 ankanams and 64 sq. feet of site situated in S.Nos. 1576/473, 1576/475 corresponding to C.A.S.No.257/1-A with RCC construction of 2400 sq feet in the gorund floor, 2400 sq feet of terraced building with RCC construction in a 1st floor, 2400 sq. feet of terraced building in a 2nd floor, 2400 sq. feet of building with RCC construction in the 3rd floor along with doors, doore frames, windows, almaras ect., and electrical fittings, current meters bearing HSC.No.829013821, 088797 transformer deposits, latrine, bathrooms, bore well and motor etc., along with easements relating there to within the following boundaries. **East :** Road, **South :** Compound wall belonging to this building along with the house of kavali Sesha Reddy, **West:** Compund wall of this building along with Municipal Park, **North :** Compound wall of this building along the building constructed by the Municipality.
1/4 th (25%) share in this property

DHR's Value : **Rs.22,00,000/-**
Amin Value : **Rs.35,12,500/-**
Market value **Rs.80,31,184/-**

Date of Auction : 06-10-2025

K.Raghunatha Reddy, B.com., B.L.,
P.Harshavardhan Reddy, B.A., B.L.,
Advocates for Dhr, 4th Main,
Ramamurthy Nagar, Nellore-524003..
Cell No: **99636 52426, 94402 42656**



గంథం దంచుతున్న దృశ్యం

గంధ మహోత్సవం

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

ఎఎస్‌పేటలోని ఖాజా నాయబ్ రసూల్ గంధ మహోత్సవంలో భాగమైన గంథం దంచే కార్యక్రమాన్ని అమ్మజాన్ మహల్‌లో గురువారం తహశీల్దార్ కె.అనిల్ కుమార్, దర్గా ఇఒ షేక్ మొహమ్మద్ హుస్సేన్, సర్పంచ్ షేక్ జిలాని భాషా, ఎఎస్ విక్రమ్ ఇతర నాయకులు అధికారులు ప్రారంభించారు. అనంతరం గంథం దంచడానికి భారీ సంఖ్యలో పాల్గొన్న మహిళ భక్తులు పాల్గొన్నారు.



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

మండలస్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి-సంగం

సంగంలోని స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్‌లో స్కూల్ గేమ్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి బీవీ రమణయ్య గురువారం మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. వాలీబాల్, కబడ్డీ, కోకో, చెస్, క్యారమ్స్ పోటీలకు మండలంలోని పలు ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల నుండి క్రీడాకారులు పాల్గొని ఉత్సాహంగా ఆడారు. గెలుపొందిన క్రీడాకారులు సెప్టెంబర్ 8వ తేదీ ఆత్మకూరులో జరిగే డివిజన్ స్థాయి పోటీలకు హాజరవుతారని ఆయన తెలిపారు.

In The Court of the I Addl. District Judge : Nellore.
I.A.No. 750 / 2024
Sr.O.P.No. 410 / 2024

Bogolu Surendra Reddy - Petitioner/ Petitioner
Vs
1. Nellore Club, Nellore Being rep. by its President, C/o Nellore. Club, Podalakur Road, Nellore. and 6 others
- Respondents/ Respondents
8. Isanaka Suneel Kumar Reddy,
(Former Secretary to the Club)
and 7 others - Respondents / Proposed Parties

Notice to 14th Respondent

Dubbisetty Sobhan Babu, Father's name not known to the petitioner, D.No.6/481, Jeenigala Street, Stone housepet, Nellore-524002. (to implead as 14th Respondent).

పై నెంబరున పిటిషనరు / పిటిషనరు పై తెలిపిన **Sr.O.P.No.410 / 2024** కేసులో మిమ్మల్ని ప్రపోస్డు పార్టీ (14 రెస్పాండెంటు) గా చేర్చమని కోరుతూ పై తెలిపిన కోర్టులో అండర్ ఆర్డర్ 1, రూల్ 10 ఆఫ్ సి.పి.సి. ప్రకారం పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే15-10-2025ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

సిహెచ్. నవీన్, బి.కాం., ఎల్.ఎల్.బి.,
బి.కృష్ణవేణి, బి.ఎ., ఎల్.ఎల్.బి.,
పిటిషనరు / పిటిషనరు తరపు అడ్వకేట్స్, నెల్లూరు.



నినాదాలు చేస్తున్న దృశ్యం

కొనసాగుతున్న నిరసనలు

ప్రజాశక్తి-నెల్లూరు: నెల్లూరు సర్కిల్ ఆఫీస్ వద్ద విద్యుత్ ఉద్యోగుల కార్మికుల జాయింట్ ఆక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి రాష్ట్ర జెఎసి నాయకులు ఎస్కె అల్తాఫ్ మాట్లాడుతూ, విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభు త్వం నిర్లక్ష్యం చేయడం ఆందోళనకరమని పేర్కొ న్నారు. కాంట్రాక్ట్ కార్మికుల రెగ్యులరైజేషన్ పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ బకాయిలు, ఎనర్జీ అసిస్టెం ట్లకు ప్రమోషన్లు, డీఏలు వంటి అన్ని డిమాండ్లకు తక్షణమే పరిష్కారం చూపాలని ప్రభు త్వాన్ని కోరారు. సమస్యలు తక్షణమే పరిష్కరిం చకపోతే పోరాటాన్ని మరింత ఉధృత్వం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు, దామోదర్, శ్రీనివాసులు, ఎస్కె నజీర్ ఖాన్, వెంక టేశ్వర్లు, రఫీ, నవాబ్ జాన్, కాంట్రాక్టు యూనియన్ నాయకులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల మత్తులో యువత పడొద్దు

ప్రజాశక్తి-కోవూరు: యువత మాదకద్రవ్యాల మత్తులో పడి తమ భావి జీవితాన్ని నాశనం చేసుకోకూడదని సెట్నల్ సిఇఒ బి. శ్రీనివాసరావు తెలిపారు. కోవూరు మండలం, పడుగుపాడు పంచాయతీ నేతాజీనగర్లో ఉన్న వైకెఆర్ అండ్కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల జోలికి వెళ్తే వారి జీవితంతో పాటు వారి కుటుంబం కూడా పూర్తిగా చిన్నాభిన్నం అయిపోతు ందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని భావిభారత పౌరులైన యువత మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా తమ భవిషత్తు బంగారుమయం చేసుకోవా లన్నారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దానిని సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి మహేంద్రరెడ్డి, జిల్లా ఈగల్ సెల్ ఆఫీసర్ ఫిరోజ్, ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మీప్రసూన, వైస్ ప్రిన్సిపల్ రామ్ ప్రసాద్, డాక్టర్ ఎస్. రామాంజనేయులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శ్యామల కుమారులు సూచనలు చేశారు.

అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-కోవూరు: పూర్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యా బుద్ధులు అందిస్తున్న అంగన్వాడీ కేంద్రాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోవూరు ఐసీడీఎస్ సీడీపీఓ శారద తెలిపారు. కోవూరు మండలం, ఇనమడుగు పంచాయతీ అట్ల కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో గురువారం ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కేంద్రంలో చిన్నారులకు ప్రభుత్వం అందించే బలవర్ధకమైన పౌష్టికాహారం అందించడమే కాకుండా ప్రతి నెలా 10వ తేదీలోగా వారి బరువు ఎత్తు తూచి యాప్లో నమోదు చేయాల న్నారు. అంగన్వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలకు క్రమం తప్పకుండా ఇళ్లకు వెళ్లి యాప్లో నమోదు చేసి పౌష్టి కాహారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ప్రమీల, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నాయకుల స్వార్థం కోసం పేదల ప్రాణాలు బలి

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్

అధికార పార్టీ నాయకుల స్వార్థ ప్రయోజనాల కోసం ఎంతోమంది పేద ప్రాణాలు బలవుతున్నాయని, ప్రభుత్వం ఏమి పట్టించుకోకుండా చోద్యం చూస్తుందని వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి అన్నారు. గురువారం నెల్లూరు నగరం 16వ డివిజన్లోని గుర్రాల మడుగు సంఘంలో సంగమండల వద్ద 17వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి పార్థివ దేహాలను సందర్శించి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పారు. ఆయనతోపాటు ఎంఎల్సి పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా కాకాని గోవర్ధన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ విరమణ దగ్గర



నివాళి అర్పిస్తున్న కాకాణి

రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మతి చెందడం దురదష్టకరమైన సంఘటనని అన్నారు. రోడ్డు ప్రమాదాలు సాధారణంగా దురదష్టకర పరిస్థితుల్లో సంభవిస్తాయి కానీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని ఆరోపించారు. ఇసుక అధిక లోడుతో ఉన్న టిప్పర్ రాంగ్ రూట్లో విపరీత వేగంతో కారును ఢీకొనడంతో ఏడుగురు మృతి చెందడం బాధాకరమన్నారు. జిల్లాలో పగలు రాత్రి తేడా లేకుండా అక్రమంగా ఇసుకను అతివేగంతో భారీ వాహనాలతో తోలుతూ ఎంతో మంది ప్రాణాలు తీస్తున్న అధికార యంత్రాంగం పట్టించుకోవడంలేదని ఆయన మండిపడ్డారు. ఒక్కో కుటుంబానికి 25 లక్షల రూపాయలు ప్రభుత్వం తక్షణ సహాయం అందించడంతో పాటు మరో 25 లక్షలు ప్రమాదానికి కారణమైన వారి నుండి బాధిత కుటుంబాలకు అందించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. ప్రమాదంలో మతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ఆ కుటుంబ సభ్యులకు వారు లేని రోడ్డు తట్టుకొని ముందుకు సాగే ధైర్యం అందించాలని భగవంతుని కోరుకుంటున్నామన్నారు.

ఉద్యోగుల బకాయిలను వెంటనే చెల్లించాలి


ప్రజాశక్తి-ఎడ్యుకేషన్

సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ విశ్రాంత ఉద్యోగుల బకాయిలను వెంటనే ప్రభుత్వం చెల్లించాలని, ఆ సంస్థ జిల్లా కార్యదర్శి పివి.కృష్ణారావు కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగ విరమణ చేసిన తమకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనేకసార్లు ప్రజాప్రతినిధులు, అధి కారులతో విన్నవించిన ఫలితం శూన్యం అని తెలిపారు. తాము 35 సంవత్సరాల పాటు సేవ చేసి ఉద్యోగ విరమణ చేశామని తెలిపారు. చివరి రోజుల్లో తాము దాచు కున్న నిధిని ప్రభుత్వం ఇవ్వకపోవడంతో, తమ కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడడం ఏమిటి అని ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఉద్యోగ విరమణ చేసిన కొంత మంది ఉద్యోగులు రిటైర్మెంట్ బెనిఫిట్స్ తీసుకోకుండానే చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ బిల్స్ అందడం లేదని పిఆర్సి శాలరీ అరియర్స్ ఇంకా చెల్లించలేదని తెలిపారు. తమ సమస్యలన్నీ ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు.

రేషన్ బియ్యం వాడకంపై అవగాహన

ప్రజాశక్తి-కోవూరు

ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేసే బియ్యంలో బలవర్ధకమైన పోషకాప ేరాలు ఉన్నాయని, వాటిపై కార్డుదారులకు అవగాహన కల్పించేలా డీలర్లు ప్రత్యేక శ్రద్ధపెట్టాలని తహశీల్దార్ సీహెచ్ సుబ్బయ్య అన్నారు. కోవూరులోని తహశీల్దార్ కార్యాలయంలో గురువారం మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన చౌక డిపో డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బియ్యంలో ఉండే పోషక పదార్థాలను కడిగి బయట పారవేస్తున్నారన్నారు. ఈ బియ్యంలో ఫోలిక్ యాసిడ్, ఐరన్ సంబంధించిన పదార్థాలు ఉన్నాయన్నారు. వాటిని సక్రమం పయోగించుకుంటే పౌష్టికాహార లోపం తలెత్తే పరిస్థితి



మాట్లాడుతున్న తహశీల్దార్ సుబ్బయ్య

ఉండదన్నారు. అదేవిధంగా ప్రస్తుతం డీలర్లకు నూతనంగా ఈ పాస్ మిషన్లు అందజేశారు. అక్టోబర్ నుంచి వాటిని ఉపయోగించుకునే... చూడాలన్నారు. ప్రతి నెలా 30వ తేదీలోగా ముందుగా 60 సంవత్సరాలు దాటిన వృద్ధులకు బియ్యం పంపిణీ ఇంటి వద్దనే పూర్తిచేయాలన్నారు. ప్రతి నెలా 1 నుంచి 15 వరకు ప్రభుత్వం నిర్దేశించిన వేళలు సరుకులు పంపిణీ చేయాలన్నారు. ఈ సందర్భంగా సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్ బాలకోటమ్మ డీలర్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనాథ్, డిప్యూటీ తహశీల్దార్ బషీర్, ఆర్ఐ, చౌకడిపో డీలర్ల జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, డీలర్లు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసికోల్లాసం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు: క్రీడలు మానసికోల్లాసానికి, శారీరక దారుఢ్యానికి దోహదపడతాయని మండల విద్యాశాఖ అధికారి సన్నపు రెడ్డి వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలం లోని చిన్నచెరుకూరు హైస్కూల్ ఆట ల మైదానంలో మండల స్థాయి ఎస్.జి.ఎఫ్ క్రీడా జట్ల ఎంపిక లు జరిగాయి. వీటిని ఎంఇఒ వేణు గోపాల్ రె డ్డి, ప్రధానో పాధ్యాయులు బి.పద్మజలు ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లా డుతూ క్రీడలు మానసికోల్లాసానికి, శారీర క దారుఢ్యానికి దోహదపడతాయ ని తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులు విద్యతో పాటు క్రీ డల్లో కూడా రాణిం చి జిల్లాకు, రాష్ట్రానికి,



దేశానికి మం చిపేరు తీసుకురావాలన్నారు. క్రీడ ల్లో ప్రతి ఓటమి మరో గెలుపునకు నాంది పలుకుతుందన్నారు. పోటీల్లో ఓడిన వారు నిరుత్సాహం చెంద కుండా రాబోయే ఆటల్లో గెలుపే ల క్ష్యంగా ముందుకు వెళ్లాలని సూచించారు. విద్య అనేది మనిషికి జ్ఞానాన్ని ఇ చ్చి ఎలా మెరుగుపరుస్తుందో అదే విధంగా క్రీడలు కూడా మన జీవితా నికి ఎన్నో పాఠాలు నేర్పిస్తాయన్నా రు. విద్యతో పాటు క్రీడలు కూడా భాగస్వామ్యం అయి నప్పుడు పరి పూర్ణత గల మనిషిగా అభివృద్ధి చెందుతారన్నా రు. అనంతరం హెచ్ఎం పద్మజ మాట్లాడుతూ క్రీడల ద్వారా అన్ని రంగాలలో ఉ ద్యోగ ,ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు.

దాంతో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం క్రీడా జట్ల ఎంపికలు ప్రా రంభమయ్యాయి. ఈ సంద ర్భంగా మొదటి రోజు అం డర్ 14, 17 సంవత్సరాల బాల, బాలి కలకు వాలీబాల్, కబడ్డీ క్రీడా జట్ల ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపి క లలో మండలంలోని వివిధ పాఠశాలల నుండి సుమారు 250 మంది విద్యార్థులు, వ్యాయామ విద్య ఉపాధ్యా యులు పాల్గొన్నారు.



కోళ్లను అందజేస్తున్న దృశ్యం

పొదుపు మహిళలకు పెరటి కోళ్లు అందజేత

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం: బుచ్చిరెడ్డిపాలెం పట్టణం వెలుగు కార్యాలయంలో ఏపిఎం శ్రీధర్ ఆధ్వర్యంలో పొదుపు మహిళలకు గురువారం పెరటి కోళ్లను ఆయన అందజేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు మహిళలు వారి పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు వారిని దష్టిలో ఉంచుకొని 100 యూనిట్ల కోళ్లను అందించామన్నారు. కోళ్లను పెంచడం ద్వారా గుడ్లను కొనుగోలు చేసే అవసరం ఉండదని ప్రతిరోజు గుడ్లను తినవచ్చని వాటిని తినడం ద్వారా ఆరోగ్యంగా,బలంగా ఉంటారని ఆయన వివరించారు. అంతే కాక కోళ్లను పెంచడం ద్వారా వాటిని అమ్మకాలకు విక్రయించి ఆర్థికంగా లాభాలు పొందవచ్చు అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మన్నేపల్లి శ్రీనివాసులు, కెనరా బ్యాంక్ సిబ్బంది, సీసీలు, వి ఓ ఏ లు, తదితరులు పాల్గొన్నారు.



ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి-కోవూరు: కోవూరు మండలం ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం స్వస్థ నారీ నశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆప్తమాలజిస్ట్ లక్ష్మీప్రసూన ఆధ్వర్యంలో 175 మందికి కంటి పరీక్షలు నిర్వహించి వారికి తగు సలహాలు, సూచనలు చేశారు. ఈకార్యక్రమాన్ని మండల పరిషత్ అధ్యక్షురాలు టి. పార్వతి, జెడ్పీటీసీ సభ్యురాలు ఎ.లత, మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డిలు పరిశీ లించి వైద్యులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్ర మంలో నేతలు చైతన్య, నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు సునీల్‌రెడ్డి, ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ నిరంజన్, డాక్టర్ ఇర్ఫాన్, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

చింతా సుమన్‌కు పరామర్శ

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

: మండలం, వెంకన్నపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు చింతా సుమన్‌ను టీడీపీ సర్వేపల్లి నియోజకవర్గం సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న చింతా సుమన్‌ను గురువారం రాజగో పాల్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా రాజగోపాల్ రె డ్డి సుమన్ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకొని ఆయనకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యం ప్రయివేటుపరం దారుణం

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్

కూటమి ప్రభుత్వం పేదలకు అందవలసిన ఉచిత వైద్యాన్ని ప్రయివేటుపరం చేయడం దారుణమని వైసిపి రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నారు. గురువారం స్థానిక డైకాస్ రోడ్ లోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి హయాంలో 17 మెడికల్ కాలేజీలు మంజూరు చేయించారన్నారు. ఏడు మెడికల్ కాలేజీలు పూర్తిచేసి 10 మెడికల్ కాలేజ్ నిర్మాణం పూర్తయ్యే దశలో చంద్రబాబు అధికారం చేపట్టారన్నారు. జగన్మోహన్ రెడ్డి రాష్ట్రానికి తెచ్చిన మెడికల్ కాలేజీలను స్వార్థ ప్రయోజనాల కోసం చంద్రబాబు ప్రయివేటీకరణ చేస్తున్నారన్నారు. పేద విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించి న పేదల వైద్యానికి అవసరమైన మెడికల్ కాలేజీలను ప్రభుత్వం తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

యుటిఎఫ్ రణభేరి యాత్రకు ఘన స్వాగతం

గుడ్లూరు : ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీరం చేస్తుందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నవ కోటేశ్వరరావు విమర్శించారు. యుటిఎఫ్ రణభేరి ప్రచార యాత్ర సందర్భంగా గుడ్లూరు బస్టాండ్ సెంటర్ నుంచి ఎంఇఒ కార్యాలయం వరకు గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ విద్యా విధానంపై ప్రసంగించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడిచిన విద్యా వ్యవస్థలో పేరుకుపోయిన సమస్యలకు పరిష్కారం చూపలేదని విమర్శించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జీవి చలపతి శర్మ జిల్లా గౌరవ ఉపాధ్యక్షులు కిలారి వెంకటేశ్వర్లు రాష్ట్ర యుటిఎఫ్ కౌన్సిలర్ జ్యోతి కుమారి యుటిఎఫ్ మండల మహిళా అధ్యక్షురాలు ప్రసన్న వాణి శిరీష 50 మంది యుటిఎఫ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గుడ్లూరులో..

ప్రజాశక్తి-కందుకూరు : యు.టి.ఎఫ్ నిర్వహిస్తున్న రణభేరి ప్రచార జాత గురువారం కందుకూరు పట్టణానికి చేరుకుంది. 100 మోటార్ సైకిళ్ల తోటి పట్టణంలోని పామూరు రోడ్డు కూడలి నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ బహిరంగ సభ నిర్వహించారు. ా యు.టి.ఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కిలారి వెంకటేశ్వర్లు మాట్లాడారు. ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుండి పూర్తిగా విముక్తి కలిగించి తరగతి గదిలో బోధనకు మాత్రమే ఉపాధ్యాయులను పరిమితం చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. అనేక భోధనేతర కార్యక్రమాలు ఉపాధ్యాయులకు ముడి పెట్టడం, మానసిక ప్రశాంత లేకుండా చేస్తుందన్నారు. వెంటనే బోధనేతర పనులను తొలగించి, 12 వ పి.ఆర్. సి కమిటీని నియమించాలని, డీ.ఏ లు విడుదల చేయాలని, ఐ.ఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి ఎన్. నవకోటేశ్వరరావు మాట్లాడుతూ ఈ ప్రభుత్వ వైఖరి కారణంగానే నేడు రాష్ట్రంలో వేలాది మంది ఉపాధ్యాయులు వివిధ ప్రాంతాల్లో సమస్యల సాధనకు రోడ్డెక్కారని విమర్శిం చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జీ.వీ.చలపతి శర్మ,జిల్లా కార్యదర్శిలు పొన్నగంటి వెంకటేశ్వర్లు, బాల రాగయ్య ,కళ ాబందాలు,వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులు, సీనియర్ నాయకులు,పెన్షనర్లు పాల్గొన్నారు.



కందుకూరులో.

పిడుగుపాటుతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కోవూరు : కూలి నాలి పనులు చేసుకుంటూ జీవన సాగించే కుటుంబంలో పిడుగు పడి ఆ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసింది. కోవూరు మండలం, వేగూరు పంచాయతీ దళితవాడలో గురువారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు..దళితవాడ ప్రాంతానికి చెందిన గోళ్ల వెంకయ్య.(63) గురువారం యధావిధిగా పశువులు తోలుకొని పొలంలోకి వెళ్లాడు. ఈ నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం కురిసిన అకాల వర్షానికి పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఉదయం ఇంటి దగ్గర ఉండి తీరా పశువులు తోలుకొని వచ్చి అకాల మృత్యువాత పడడంతో ఆ కుటుంబం తీరని ఆవేదనలో మునిగిపోయింది. ఈ మేరకు హుటాహుటిన వెంకయ్యను కోవూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు తీరని విషాదంలో మునిగిపోయారు.



మృతుడు వెంకయ్య

11 బార్లకు లైసెన్స్‌లు కేటాయింపు

ప్రజాశక్తి-నెల్లూరు : జిల్లాలో బార్ లైసెన్స్ కేటాయింపు ప్రక్రియను కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆధ్వర్యంలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు నిర్వహించారు. గురువారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు బార్ లైసెన్స్‌ల కేటాయింపు ప్రక్రియను దరఖాస్తుదారుల సమక్షంలో నిర్వహించారు. 11 బార్లకు జనరల్ కేటగిరిలో ఒక్కొక్కరే దరఖాస్తు చేయగా, వారికి ఆ బార్ ల్కెసెన్సులను కేటాయించారు. అందులో నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో 7 బార్లు, బుచ్చి మున్సిపాలిటీ పరిధిలో ఒకటి, కావలి మున్సిపాలిటీ పరిధిలో 3 బార్లు ఉన్నాయి. అల్లూరు నగరపంచాయతీకి సంబంధించి గీత కులాల కేటగిరిలో ఇద్దరు దరఖాస్తు చేయగా, కలెక్టర్ లాటరీ తీసి ఒకరికి కేటాయించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ ఎం. శంకరయ్య, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి శ్రీనివాసులు నాయుడు, సూపరింటెండెంట్ జె రమేష్, ఎక్సైజ్ సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



లాటరీ తీస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా













